
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
మంగళవారం 18 నవంబరు 2025



సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి



విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న ఎంపీడీఓ

ఇల్లంతకుంట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఎంపీడీఓ శశికళ పేర్కొన్నారు. మండలంలోని వెల్జీపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి అందించిన క్రీడాదుస్తులను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ హరికృష్ణారెడ్డి పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ స్థాయిలో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాట్నపెల్లి స్వామిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ దెశెట్టి పద్మశ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శేఖర్, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, అరుణ, అనురాధ, రాజిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్‌వైర్లు.. తప్పిన ప్రమాదం

ఇల్లంతకుంట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడగా అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించడంతో ప్రమాదం తప్పింది. పత్తిని తీసుకొని వెలుతున్న లారీకి సోమవారం విద్యుత్ వైర్లు తాకి తెగిపడ్డాయి. వెంటనే గమనించిన గ్రామస్థులు సెస్ అధికారులకు సమాచారం అందించగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణలు కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో సోమవారం సీఐటీయూ జిల్లా నాలుగ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30వ తేదీలల్లో జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, ఎలిగేటి శ్రీనివాస్, ఎలిగేటి రాజశేఖర్, ఉడుత రవి, బాసశ్రీధర్, గడ్డం రాజశేఖర్, బింగి సంపత్, చింతకింది సుదర్శన్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, విద్యార్థులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు17(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలో ఇంటర్మీడియడ్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తే స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రం అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం ఏర్పడి 10 ఏళ్ల గడుస్తున్నా.. ఇంటర్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం పరీక్ష కేంద్రాన్ని కేటాయించకపోవడం అన్యాయమని అన్నారు. పరీక్షలు రాసేందుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. పరీక్ష వేళలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేకపోవడం వల్ల ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, మనోజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగు నీరు అందక ఇబ్బందులు

- పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది



పైపులను సరిచేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి 5వ వార్డులో గత మూడు రోజులుగా ఇళ్లలోకి తాగు నీరు రాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాంపల్లి గ్రామంలో వేసిన బోరుబావి నుంచి ఆకాశగంగ పైపులైన్ ద్వారా నాంపల్లి కాలనీలో తాగునీరు అందుతోంది. అయితే గత మూడు రోజులుగా నీటి సరఫరా జరిగే పైపులు పగిలిపోయి నీరు రాకపోవడంతో కాలనీవాసులు మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించారు. మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో గ్రామానికి చెందిన బీజేపీ యువకులు నీటి పైపులను సరిచేసి కాలనీవాసులకు నీరందించేందుకు శ్రమించారు. దీంతో పగిలిన పైపులను సరిచేసిన బీజేపీ నాయకులు మేర్గు లక్ష్మణ్, వానిక సంతోష్, చిలివేరి సంతోష్, అనిల్‌లను కాలనీవాసులు అభినందించారు.

బాలల హక్కులపై అవగాహన

ఎల్లారెడ్డిపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను రక్షించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని బాలల సంరక్షణ అధికారి రమేశ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ పరివర్తన ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణ, బాలల హక్కులపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణహరి, హెచ్‌ఎం మనోహరచారి, ప్రతినిధులు జనార్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

నేటి యూనిటీ మార్చ్‌కు హాజరుకానున్న కేంద్ర మంత్రి

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగే యూనిటీ మార్చ్ ర్యాలీలో కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొంటారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తెలిపారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకుని పట్టణంలో మార్చ్ ర్యాలీ జరుగుతుందన్నారు.

20న కార్తీక దీపోత్సవం

ఎల్లారెడ్డిపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు వద్ద ఈ నెల 20 కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని నిర్వాకులు సోమవారం తెలిపారు. కార్యక్రమానికి విద్యారణ్య భారతీస్వామి హాజరు కానున్నారని పేర్కొన్నారు. వేద పండితులు రాచర్ల రఘురామశర్మ, రాచర్ల విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో జరుపబడునని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.


రేపు జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

ఇల్లంతకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో జరుగుతాయని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మునీరొద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 11,13,15,17,19 మెన్, ఉమెన్ విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలతో హాజరుకావాలని కోరారు. పోటీలలో ఎంపికైన వారు హైద్రాబాద్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

స్వదేశానికి రప్పించాలని వేడుకోలు

ఇల్లంతకుంట, నవంబరు 17,(ఆంధ్రజ్యోతి) ఉపాధి కోసం దుబాయి వెళ్లిన మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన దాసరి పర్శరాం స్వదేశానికి రప్పించాలని వేడుకొంటున్నాడు. కుటుంబీకుల వివరాల ప్రకారం పర్శరాం డీజిల్ మెకానిక్ వీసా అని చెప్పడంతో ఏజెంట్ వద్ద రూ.1.50లక్షలు చెల్లించి ఈ నెల 13న దుబాయి వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత భవననిర్మాణ పనిలో పెట్టడంతో తాను లేబర్ పనిమీద రాలేదని చెప్పినా అక్కడి వారు అంగీకరించడం లేదని ఇదేపనిలో కొనసాగాలని ఆదేశించారని తెలిపారు. ఇంటికి వెళ్లాలంటే రూ. 2లక్షలు చెల్లించాలని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించాలని వేడుకుంటున్నారు.

భూ సర్వేకు సిద్ధం



- జిల్లాలో పక్కాగా భూముల లెక్క
- తొలి విడతగా 70 గ్రామాల ఎంపిక
- భూముల సమస్యలకు పరిష్కారం
- జిల్లాలో 4.68 లక్షల ఎకరాల భూములు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

భూ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. బీఆర్‌ఎస్ హయాంలో తీసుకువచ్చిన ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చింది. ధరణిలో అనేక లోపాలు బయట పడడంతో పకడ్బందీగా ఉండే విధంగా భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం కోసం ముందుగా గ్రామాల్లో భూములను సర్వే చేయించాలని నిర్ణయించింది. దీంతో భూముల లెక్క పక్కాగా ఉంటుందని భావిస్తున్నారు. ఇదే క్రమంలో రైతు భూములన్నిటికీ కలిపి భూధార్ నెంబర్ కూడా కేటాయించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎంజాయ్‌మెంట్ డిజిటల్ సర్వేలో భాగంగా తొలివిడతగా 70గ్రామాల్లో సర్వే చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. జిల్లాలో 13 మండలాలు 171 రెవెన్యూ గ్రామాలు ఉండగా 91,416 సర్వే నెంబర్లు ఉన్నాయి. జిల్లాలో 4.68 లక్షల ఎకరాల భూములు ఉన్నాయి.

తంగళ్లపల్లి మండలంలో ఎక్కువ గ్రామాలు మిగతా మండలాల్లో ఐదు గ్రామాల వరకు సర్వే కోసం ఎంపిక చేశారు. ఇందులో రుద్రంగి, వీర్నపల్లి మండల కేంద్రాలు, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పెద్దూరు, బోనాల, ముష్టిపల్లి, తంగళ్లపల్లి మండలంలో సర్దాపూర్, రామచంద్రాపూర్, నర్సింహులపల్లి, గండిలచ్చపేట, వేణుగోపాల్‌పూర్, మండెపల్లి, తంగళ్లపల్లి, సారంపల్లి, చీర్లవంచ, చింతల్‌ఠానా, బస్వాపూర్, నేరెళ్ల, తాడూరు, గంభీరావుపేట మండలంలో ముచ్చర్ల, ఖుర్దులింగంపల్లి, రామానుజపురం, శ్రీనివాసపురం, ఎల్లారెడ్డిపేట మండలంలో పోతిరెడ్డిపల్లి, సర్వాయిపల్లి, కోరుట్ల పేట, సింగారం గ్రామాలు ఉన్నాయి. ముస్తాబాద్ మండలంలో మొర్రాపూర్, తుర్కపల్లి, గూడూరు, మొర్రాయిపల్లి, తెర్లుమద్ది, ఇల్లంత కుంట మండలంలో సిరికొండ, జంగంరెడ్డిపల్లి, తిప్పాపూర్, జవహర్‌పేట, రహీంఖాన్‌పేట, వేములవాడ అర్బన్ మండలంలో మారుపాక, తెట్టెకుంట, చంద్రగిరి, వేములవాడ రూరల్ మండలంలో బొల్లారం, జయవరం, రుద్రవరం, వెంకటంపల్లి, అనుపురం, కొడుముంజ, కోనరావుపేట మండలంలో లచ్చపేట, మర్తనపేట, వెంకట్రావుపేట, మల్కపేట, పల్లిమక్త, రామన్నపేట, కొలనూర్, బోయినపల్లి మండలంలో కొత్తపేట దుండ్రపల్లి మల్లాపూర్, మాన్వాడ, కొదురుపాక, వర్ధవెల్లి, చందుర్తి మండలంలో అనంతపల్లి, లింగంపేట, ఎన్గల్, జోగానూర్, బండపల్లి గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

భూములకు భూధార్ :

జిల్లాలో భూముల సర్వేతో పాటు భూధార్ నంబరు కూడా కేటాయించనున్నారు. భూముల సర్వేలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే అక్కడ సర్వే నిలిపేసి మరోచోట సర్వే చేస్తారు. సర్వేతో ఎవరి భూములు

మిగతా 8వ పేజీలో..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే

- శ్రీనివాస్, జిల్లా అధికారి ల్యాండ్ అండ్ సర్వే

ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములను సర్వే చేయడానికి 70 గ్రామాలను తొలివిడతగా ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిం చాం. సర్వే కోసం జిల్లాలో 66 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాం. ప్రభు త్వం నుంచి ఆదేశాలు రాగానే సర్వే ప్రారంభిస్తాం.

భూభారతి దరఖాస్తులకు మోక్షం

ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలు కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 6,787 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో భూ సమస్యలపై 6,787 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, సాదాబైనామాలు, కోర్టు కేసులు, ఒకరి భూములు మరొకరిపై నమోదు కావడం, పెండింగ్ మ్యుటేషన్ తదితర సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. మిస్సింగ్ సర్వే నెంబర్లకు సంబంధించి 1,393 దరఖాస్తులు, పెండింగ్ మ్యుటేషన్‌కు 295 దరఖాస్తులు, డీఎస్ పెండింగ్‌లో 404 దరఖాస్తులు వచ్చాయి. భూమి విస్తీర్ణం, చేర్పులు మార్పులు సంబంధించి 2,093 దరఖాస్తులు వచ్చాయి. నిషేధిత జాబితాలో భూములు నమోదు అయినట్లు సవరించడానికి 270 దరఖాస్తులు వచ్చాయి. అసైన్డ్ భూములు, భూ సేకరణ, ఇతర రికార్డులకు సంబంధించిన సమస్యలపై 3,489 దరఖాస్తులు వచ్చాయి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా వాణిలో భూముల సర్వేకి సంబంధించిన వినతి పత్రాలు వస్తున్నాయి. సర్వేయర్ క్షేత్ర స్థాయికి వెళ్లి చేసే సర్వేతో వీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

కళాకారులను గుర్తించి పెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను గుర్తించి పెన్షన్ అవకాశం కల్పించాలని జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు ఏరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనుమరుగు అవుతున్న కళలను కాపాడటానికి రామాయణం, మహాభారతం, ఎల్లమ్మ, సత్యహరిశ్చంద్ర, బ్రహ్మంగారి జీవిత చరిత్ర, భక్త మార్కండేయ నాటకాలను వేస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా పాటలు రాసి పాడి ఆడి ప్రజలను చైతన్య పరచామన్నారు. కరోనా సమయంలో కూడా కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందన్నారు. కళాకారుల గురించి ఆలోచన చేయలేదని తమకు ఎలాంటి సహాయం అందించలేదని వాపోయారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా తమకు ఎలాంటి న్యాయం చేయకపోవడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాకు న్యాయం చేస్తారని నమ్మకం ఉందని కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నాయిని సత్యనారాయణరెడ్డి, కోశాధికారి శ్రీరాములు శ్రీనివాస్, నాయకులు దర్శనాల శ్రీనివాసచారి, తిరుపతి, లక్ష్మన్‌గౌడ్, బాబురెడ్డి, మల్లేశం, మోహన్‌రెడ్డి, బాలయ్యగౌడ్, జిన్నయ్య, మల్లయ్య, దేవరాజు, కరణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా కల్పిస్తాం

● బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు



మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగాల్లో ఉన్న ఆటో డ్రైవర్లకు కేసీఆర్ ప్రభుత్వం రూ 5 లక్షల ప్రమాద బీమా కల్పించడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీమాను రెన్యువల్ చేయకపోవడంతో వేలాది మంది ఆటో డ్రైవర్లు బీమా సౌకర్యాన్ని కోల్పోయారని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో డ్రైవర్లందరికీ ప్రమాద బీమా కోసం అవసరమైన ప్రీమియం తానే చెల్లిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. సోమవారం సిరిసిల్లలో బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆటో డ్రైవర్లు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. అంతకు ముందు సిరిసిల్ల పట్టణం, ఇతర మండలాల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో విడివిడిగా సమావేశం అయ్యారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో మార్గదర్శనం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రు 5 లక్షల బీమా కల్పించడం ద్వారా దురదృష్టశాత్తు ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి సహాయంగా ఉండేదని అన్నారు. ఆటో డ్రైవర్ల వివరాలు బుధవారం సాయంత్రంలోగా అందజే యాలని ఆటో యూనియన్ల నాయకులను కోరారు. సమావేశంలో నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీం దర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఉన్నారు.

గజ..గజ

జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 8.4 డిగ్రీలుగా నమోదు

సిరిసిల్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో జనం చలికి వణికిపోతున్నారు. సోమవారం ఉదయం వరకు జిల్లాలో సరాసరి ఉష్ణోగ్రత కనిష్టం 8.4 డిగ్రీలు, గరిష్టం 31.5డిగ్రీలుగా నమోదైంది. జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రత రుద్రంగిలో 8.4డిగ్రీలు, గంభీరావుపేటలో 8.7,బోయిన్‌పల్లిలో 9.7 వీర్నపల్లిలో 10.5, తంగళ్లపల్లిలో 10.5, వేములవాడ రూరల్‌లో 10.9, ఇల్లంతకుంటలో 11.3 డిగ్రీలు, సిరిసిల్లలో 11.3 డిగ్రీలు, ముస్తాబాద్‌లో 11.6 డిగ్రీలు, వేములవాడలో 11.8 డిగ్రీలు, చందుర్తిలో 12.2 డిగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో 12.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు సాయంత్రం జనసంచారం తగ్గిపోయింది. అవసరం ఉంటేనే ప్రజలు బయటకు వస్తున్నారు.

నిలిచిన సీసీఐ కొనుగోళ్లు

వేములవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగళ్లను నిలిపివేశారు. నిరవధిక బంద్‌లో భాగంగా సీసీఐ ఆధ్వర్యంలో ఎల్1, ఎల్2, ఎల్3 పేరుతో కొన్ని మిల్లులు నడిపి కొన్ని మిల్లులు నడపనందున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిన్నింగ్ మిల్లులు తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంద్‌ను ప్రకటించాయి. రాష్ట్ర వ్యాప్తంగా వున్న అన్ని జిన్నింగ్ మిల్లులకు సీసీఐ కొనుగోళ్లు చేసేలా అనుమతి ఇవ్వాలని డిమాండ్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. కొన్ని మిల్లులకు మాత్రం సీసీఐ కొనుగోళ్లకు అనుమతి ఇవ్వడంతో సీసీఐతో పాటుగా ప్రైవేటు పత్తి కొనుగోళ్లను నిరవధికంగా నిలిపివేసినట్లు మిల్లు నిర్వాహకులు తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వేములవాడలో లబ్ధిదారులకు వస్త్రాలు అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్



ధర్మారంలో ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహ ప్రవేశానికి సోమవారం హాజరై నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో నిరుపేదలు ఉండకూడదని, ప్రతి పేదవారికి స్వంత ఇళ్లు ఉండాలని దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆలోచించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. పట్టణంలో సుమారు 490 మందికి పైగా లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ నాయకులు బింగి మహేష్, ఇప్పపూల అజయ్, పుల్కం రాజు, చిలుక రమేష్, కూరగాయాల కొమురయ్య, అన్నారం శ్రీనివాస్, నీలం గురువయ్య తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, బొర్ర రవీందర్, అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, అబ్దుల్ రషీద్, గణేష్, వెంగలి వెంకన్న పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎస్పీ



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిం చడమే పోలీసుల లక్ష్యమని ఎస్పీ మహేష్ బి గీతే పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 28 మంది బాధితులతో మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరిం త చేరవ చేయడమే లక్ష్యంగా , ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి అవసరమైన క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారులకు పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావడంతో సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

కారు.. బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఆదివారం అర్ధరాత్రి బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో బంక అరుణ్(23)అనే యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాలరూరల్ ఎస్సై ఉమాసాగర్ కథనం ప్రకారం.. బుగ్గారం మండలం శెకల్ల గ్రామానికిచెందిన బంక అరుణ్ తనస్నేహితులైన అజయ్, విష్ణుతోకలిసి బైక్‌పై శెకల్ల గ్రామం నుంచి జగిత్యాల వైపు పనినిమిత్తం వస్తున్నారు. ఈ క్రమంలో జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోగల చిన్నగట్టు వద్ద గంగాధర ప్రాంతానికి చెందిన కారు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొనగా బైక్‌పై వెనుక కూర్చున్న బంకఅరుణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అజయ్, విష్ణులకు తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. వీరిని మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి బంక శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● **ఇద్దరి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది..**

రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అజయ్, విష్ణులకు 108సిబ్బంది ఈఎంటీ మంచాల మానస, పైలట్‌రాజు అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స నిర్వహించి తక్షణమే ప్రభుత్వఆస్పత్రికి తరలించి ఇద్దరి ప్రాణాలను కాపాడారు. బాధితకుటుంబసభ్యులు 108సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో.. యువకుడి దుర్మరణం



శ్రీనివాస్(ఫైల్)

తిమ్మాపూర్ : మండలంలోని రామకృష్ణ కాలనీ వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కళ్లెం శ్రీనివాస్(18) మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. రామకృష్ణ కాలనీకిచెందిన కళ్లెం శ్రీనివాస్ ఐటీఐ చదువు తున్నాడు. సోమవారం స్థానిక శివాలయంలో పూజచేసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు అతివేగంగా వచ్చినటిప్పర్ బైక్‌నుఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న శ్రీనివాస్ టిప్పర్ వెనక టైర్లకింద పడిపోయాడు. టిప్పర్‌టైర్లు శ్రీనివాస్ తలపై, ఛాతీపైనుంచి వెళ్లాయి. శ్రీనివాస్ తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏడేళ్లక్రితం శ్రీనివాస్ తండ్రి కూడా రామకృష్ణ కాలనీ వద్దే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్ శివారులో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఆటోఢీ కొట్టిన ఘటనలో తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య(73) మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య తన ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పని నిమిత్తం కేశవపట్నం వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తాడికల్‌లోని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వెనుకనుంచి ఆటోడ్రైవర్ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో గట్టయ్య రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొని, పక్కనఉన్న ట్రాక్టర్ కల్టివేటర్‌పై పడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గట్టయ్య కూతురు కవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కన్నుమూత

పెద్దపల్లి రూరల్ : మండలంలోని రాఘవ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి స్టేజీవద్ద కారు ఢీకొని సింగ రేణి రిటైర్డ్ కార్మికుడు మృతిచెందాడు. పెద్దపల్లిరూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చొప్పల నాగరాజు(72) కుమారునితో సోమవారం పెద్దపల్లిలో కొనుగోలు చేసిన భూమిని చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. గొల్లపల్లి స్టేజీ వద్ద వాహనాన్ని యూటర్న్ చేస్తున్న క్రమంలో గోదావరిఖని నుంచి పెద్దపల్లికి వస్తున్న కారు ఢీకొనడంతో నాగరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారునికి గాయాలయ్యాయి. సంఘటనస్థలాన్ని ట్రాఫిక్‌సీఐఅనిల్‌కుమార్, రూరల్‌పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్యలక్ష్మీ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐమల్లేష్ తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి



బుచ్చవ్వ(ఫైల్)

తంగళ్లపల్లి : రోడ్డుపక్కన బస్సు కోసం వేచి ఉన్న మహిళను కారు ఢీకొట్టడంతో మహిళ మృతిచెందగా కారు డ్రైవర్ గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి మండలకేంద్రం ఇందిరానగర్‌కు చెందిన ముగ్దం బుచ్చవ్వ(55) కూరగాయలు విక్రయిస్తూ జీవనం గడుపుతోంది. సోమవారం తెల్లవారుజామున తంగళ్లపల్లిలోని బస్టాండ్ సమీపంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద బస్సు కోసం వేచి ఉండగా సిద్దిపేట వైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో హైదరా బాద్‌కు చెందిన కారు డ్రైవర్ మోమన్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ వారిని 108వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. బుచ్చవ్వ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీనంగర్‌కు తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలికి భర్త మల్లయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి జైలు వార్డెన్ దుర్మరణం

ఓదెల, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తారకరామ కాలనీ వద్ద ఉన్న 32వ రైల్వే గేటు సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం పరకాల సబ్‌జైల్ వార్డెన్ నాగపూరి రాకేష్ రైలు నుంచి పడి మృతిచెందాడు. వరంగల్ చింతలపల్లిలో నివాసముంటున్న రాకేష్ పెద్దపల్లిలో జరిగిన మిత్రుడి వివాహానికి హాజరయ్యాడు. అనంతరం తిరుగు ప్రయాణం కోసం కాజీపేట్‌కు వెళ్లేందుకు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రాకేష్ ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు.



'షీ లీడ్స్' శిక్షణ తరగతులకు హాజరైన మహిళా కానిస్టేబుళ్లు



ధర్నాలు, నిరసనలు, ఆందోళనల సందర్భంలో నిరసనకారులను అడ్డుకోవడంలో శిక్షణ పొందుతున్న మహిళా కానిస్టేబుళ్లు

మహిళా కానిస్టేబుళ్లకు షీ లీడ్స్

● **ఇప్పటికే బ్లూకోల్ట్స్ విధుల్లో మహిళా పోలీసులు**

● **కరీంనగర్‌లో పోలీసింగ్ సంస్కరణలు**

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మేమున్నాం' అనే ధైర్యాన్ని, భరోసాను మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తున్నారు కరీంనగర్ పోలీసు కమీషనరేట్‌లోని మహిళా పోలీసులు. పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో 'షీ లీడ్స్' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇదివరకు మహిళా కానిస్టేబుళ్లు ఆఫీస్ విధులకే పరిమితమయ్యేవారు. విజిబుల్ పోలీసింగ్‌లో వారి భాగస్వాములను చేసేందుకు మహిళా కానిస్టేబుళ్లకు బ్లూ కోల్ట్స్ విధులు కేటాయిస్తున్నారు. ఈ విధానం ఇప్పటికే సత్ఫలితాలనిస్తోంది. ప్రజలకు భద్రతపై మరింత దృఢమైన నమ్మకాన్ని కల్పించడంలో మహిళా బ్లూ కోల్ట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సంఘటనలు ఎదురైనప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనేలా మహిళా పోలీసులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు 'షీ లీడ్స్' కార్యక్రమాన్ని రూపొందించి శిక్షణను ప్రారంభించారు.

● **క్షేత్ర స్థాయి సమస్యలపై శిక్షణ...**


పోలీస్ శాఖలో విధులు నిర్వహించేవారు శారీరక దృఢత్వంతో పాటు మానసికంగానూ దృఢంగా ఉండాలి. మహిళా పోలీసులు వారిని వారు రక్షించుకునే స్థితిలో ఉన్నపుడే ప్రజలను రక్షించగలరనే ఉద్దేశంతో వంద మందికి (షీ టీంల సభ్యులతో సహా) రెండు దశల్లో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. ఆత్మరక్షణ విద్యలో సుశిక్షితులుగా తీర్చిదిద్దడం కోసం కరాటే (అన్ ఆర్మ్ కంబాట్ కోర్స్)లో శిక్షణ ఇస్తున్నారు. ధర్నాలు, నిరసనల్లో ముఖ్యంగా మహిళా నిరసనకారులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సున్నితమైన అంశాలను ఎలా సమర్థంగా, మానవీయంగా నిర్వహించాలో నేర్పిస్తున్నారు. మానసిక ఒత్తిడి అధిగమించేందుకు, క్షేత్ర స్థాయి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు, పోలీసులకు మానసిక దృఢత్వాన్ని పెంచేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు.

షీ లీడ్స్ కార్యక్రమంతో ప్రజలకు మరింత దగ్గరగా.

- గౌస్ ఆలం, కరీంనగర్ పోలీస్ కమిషనర్



మహిళా పోలీసుల సేవలనుం కార్యాలయానికే పరిమితం చేయకుండా ప్రజల్లోకి తీసుకెళ్లేందకు షీలీడ్స్ కార్యక్రమం అమలు చేస్తున్నాం. మహిళా బ్లూ కోల్ట్స్ బృందం వీధుల్లో తిరుగుతుంటే, తమకు రక్షణ ఉందనే ధైర్యం, ఆత్మవిశ్వాసం మహిళల్లో మరింత పెరుగుతుంది. ఈ శిక్షణ ద్వారా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది.



విద్యార్థిని చేతికి తీవ్ర గాయాలు

ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

కోల్‌సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం ఓదెల మేఘన(16)అనే ఇంటర్ విద్యార్థిని బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో ఆమె చేయిపై నుంచి బస్సుటైర్ వెళ్లి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. ఎన్‌టీపీసీ కృష్ణనగర్‌కు చెందిన మేఘన గోదావరిఖని శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్‌కళాశాలలో హెచ్‌ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. గోదావరిఖని బస్టాండ్ నుంచి ఎఫ్‌సీఐలోని ఇంటికి వెళుతున్న సమయంలో కరీంనగర్-2 డిపోకు చెందిన బస్సు ఎక్కుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గోదావరిఖని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.

ట్రాలీ - ద్విచక్ర వాహనం ఢీ

● **ఒకరికి తీవ్ర గాయాలు**

పెద్దపల్లి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ శివారులో సోమవారం ట్రాలీ, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన అజయ్ ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వస్తుండగా పెద్దపల్లి నుంచి మంథనికి వెళ్తున్న ట్రాలీ ఎదురెదురుగా ఢీకొంది. ట్రాలీ బోల్తాపడటంతో పాటు ద్విచక్రవాహన దారునికి తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అతనితోపాటు ట్రాలీ డ్రైవర్‌కు గాయాలైనట్లు తెలిపారు. ఈ సంఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కూతురి హత్య కేసులో తండ్రి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన కూతురి హత్య, కొడుకుపై హత్యాయత్నం కేసులో వారితండ్రి అనవేణి మల్లేష్(38)ని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జాన్‌రెడ్డి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన అనవేణి మల్లేష్ 15ఏళ్లుగా నగరంలోని వావిలాలపల్లి వాసవినగర్‌లో నివాసం ఉంటున్నాడు. హమాలీ పనిచేసుకుంటూ భార్య పోసవ్వ, దివ్యాంగులైన కూతురు హర్షిత, కొడుకు హర్షిత్‌ను పోషించుకుంటున్నాడు. ఆ ఇద్దరు పిల్లలు చిన్నవయస్సు నుంచి మానసిక, శారీరక అంగవైకల్యంతో బాధపడుతున్నారు. చికిత్సకోసం అనేక ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించారు. పిల్లల ఆరోగ్య, మానసిక పరిస్థితిలో మార్పు రాలేదు. పిల్లల పరిస్థితి జీవితాంతం మారదని వైద్యులు స్పష్టం చేయడంతో నిందితుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఘాతుకానికి పాల్పడ్డాడు.

● **ఘటన జరిగిన తీరు..**

ఈ నెల 15న మధ్యాహ్నం నిందితుడి భార్య మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో మల్లేష్ మొదట కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి పిల్లలకు ఇవ్వడానికి ప్రయత్నించగా వారు నిరాకరించారు. అనంతరం ఒక కాటన్ టవల్‌ను రెండు ముక్కలు చేసి వాటితో కూతురు(హర్షిత), కొడుకు (హర్షిత్) మెడకు ఉరివేశాడు. దీంతో కూతురు మరణించగా, కొడుకు స్పృహ కోల్పోయాడు. అనంతరం మల్లేష్ టవల్ ముక్కలను బయట పారేసి ఇంటినుంచి పారిపోయాడు. ఘటన తర్వాత నిందితుడు అదే సాయంత్రం కరీంనగర్ నుంచి హైదరాబాద్ జేబీఎస్‌కు చేరుకున్నాడు. అక్కడ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. మరుసటి రోజు మంచిర్యాలకు వెళ్లి అక్కడ తిరుగుతూ పోలీసుల భయంతో తలదాచుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఉదయం కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లేష్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడి మొబైల్‌ఫోన్, రెండు బస్‌టికెట్లు, హత్యకు ఉపయోగించిన రెండు కాటన్ టవల్ ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

బట్టల షాపులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టుచౌరస్తా సమీపంలోని మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్‌లో సోమవారం వేకువజామున 3గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈప్రమాదంలో కోటి రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు అంటుకోగా స్థానికులు అందించిన సమాచారంతో కరీంనగర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది తెల్లవారు జామున 3 గంటలకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కరీంనగర్, మానకొండూర్ ఫైర్‌ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే షాపులో ఉన్న బట్టలు, ఫర్నిచర్, ఏసీలు దగ్ధమయ్యాయి. షాపు యజమాని సంగం రాజేశం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి అరెస్టు

సారంగాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లైంగికదాడి చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల మేరకు సారంగాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ళ చిన్నారిపై అదే గ్రామానికి చెందిన బాపు(48) అనేవ్యక్తి బాలిక ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి కొద్దిరోజుల క్రితం లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో చిన్నారి ఏడ్చుకుంటు ఇంటికి వెళ్లగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగిత్యాల సీఐ సుధాకర్, ఎస్ఐ గీత నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

జ్యోతినగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీపీసీ ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద రోడ్డుపై ఓ వ్యక్తి పడి పోయాడు. దీంతో అక్కడివారు 100కు డయల్‌చేసి విషయం చెప్పగానే విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ నవీన్ రావు అక్కడికి చేరుకుని, ప్రమాదవివరాలు సేకరించిబాధితుడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆపదలో ప్రజలు వందకు డయల్‌చేస్తే పోలీసులు అందుబాటులో ఉండి సేవలందిస్తారని ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. వెంటనే స్పందించి, బాధితుడిని ఆసుపత్రికి తరలించిన కానిస్టేబుల్‌ను ఎస్ఐ అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చల్లూరుకు చెందిన ఎండీ అహమ్మద్దీన్ ఏప్రిల్ 1న కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ములుగులో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రూరల్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి సెల్ ఫోన్‌ను బాధితుడికి అందజేశారు.

ఫ్యాన్సీ నంబర్లు మరింత ప్రియం

● **భారీగా రుసుమును పెంచిన ప్రభుత్వం**

తిమ్మాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసిన వారిలో కొందరు వారికి కలిసి వచ్చే నంబర్లను దక్కించుకునేందుకు ఎంతైనా డబ్బులు వెచ్చిస్తారు. అవసరమైతే వేలంలో పాల్గొని అయిన వాటిని చేజిక్కించుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నంబర్ల కేటాయింపుపై కీలక నిర్ణయం తీసుకుంది. వాహనాలకు ఇచ్చే ప్రత్యేక (ఫ్యాన్సీ) నంబర్ల రిజర్వేషన్ కోసం ప్రస్తుతం తీసుకుంటున్న రుసుమును భారీగా పెంచింది. తెలంగాణ మోటారు వాహనాల రూల్స్ 1989లోని నియామలు, నిబంధనలను సవరిస్తూ తుది నోటిఫికేషన్‌ను జారీ చేసింది. పెంచిన రెట్లు, నంబర్లను నోటిఫికేషన్‌లో పొందుపరిచింది.



తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం

● **నంబర్ల రిజర్వేషన్‌కు చెల్లించాల్సిన రుసుము**

☑ 9999 నంబరు కావాలనుకునే వారు 1.5 లక్షల రూపాయలు చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఈ మొత్తం 50 వేలు రూపాయలుగా ఉండేది.

☑ 1, 9, 6666 ఈ నంబర్లు కావల్సిన వారు లక్ష రూపాయలు చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

☑ 99, 999, 3333, 4444, 5555, 7777 నంబర్లు కావల్సిన వారు 50,000 రూపాయలు చెల్లించాలి.

☑ 5, 6, 7, 123, 333. 369, 555, 666, 777, 1111, 1116, 1234, 2222, 2277, 2345, 2727, 3339, 3366, 3456, 3699, 4455, 4545, 4599, 6669, 6789, 4455, 4545, 4599, 6669, 6789, 8055, 8888 నంబర్లు కావాల్సిన వారు 40 వేల రూపాయలు చెల్లించాలి.

(5) 3, 111, 234, 567, 1188, 1818, 1899, 1999, 2799, 3636, 3999, 5678, 5999, 6999, 7999, 9009 నంబర్లు కావాల్సిన వారు 30 వేల రూపాయలుచెల్లించాలి.

(6).2, 4, 8, 11, 18, 27, 36, 39, 45, 55, 77, 143, 222, 405, 444, 456, 459, 786, 789, 909, 1112, 1122, 1212, 1233, 1269, 1314, 1359, 1889, 2223, 2255, 2259, 2349, 2525, 3335, 3344, 3399, 3555, 3789, 3888, 3969, 4446, 4554, 4567, 4777, 4959, 5445, 5559, 5589, 5599, 5666, 5679, 5859, 6336, 6699, 6777, 6786, 6969, 7779, 7799, 7979, 8889, 8899, 8999, 9099 నంబర్లు కావాల్సిన వారు 20వేల రూపాయలు రుసుము చెల్లించి రిజర్వ్ చేసుకోవాలి.

ఇవి కాకుండా మిగతా ఏ నంబర్ కావాలన్నా ద్విచక్ర వాహనదారులు మూడు వేలు, కార్లు, ఇతర వాహనాదారులు ఆరు వేల రూపాయలు రుసుము చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

● **నిబంధనలు..**

నంబర్ల రిజర్వేషన్‌కు సంబంధిత రవాణా శాఖ పోర్టల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

☑ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన బిడ్‌లను పరిశీలిస్తారు.

☑ ఒకే నంబరుకు ఒకటి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే వారిలో అత్యధిక బిడింగ్ వేసిన వారికి నంబర్‌ను కేటాయిస్తారు.

☑ దరఖాస్తుదారుడు బిడ్ సమర్పించకపోతే చెల్లించిన రుసుమును తిరిగి ఇవ్వరు. రిజర్వేషన్ చేసుకుని వేలంలో పాల్గొన్నా నంబర్ రాకపోతే కట్టిన రుసుములో 10శాతం మినహాయించుకుని మిగతా మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు.

ర్యాష్ డ్రైవింగ్.. మారని డ్రైవర్ల తీరు

● **రోజుకో రోడ్డు ప్రమాదం**

● **పలువురికి గాయాలు**

మానకొండూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్‌తో రోజుకో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటోంది. కొంత మంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటుండగా మరికొంతమంది గాయాలతో బయ టపడి నరకయాతన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ, లారీ డ్రైవర్ల తీరు మారడం లేదని ప్రయాణికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సులు రోజుకు సుమారు 15ట్రిప్పులు ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తాయి. దీంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, వీణవంక, జమ్మికుంట మండలాలకు చెందిన పలు వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు మండలంలోని ఊటూరులోని మానేరు వాగు, వీణవంక మండలంలోని కోర్కల్, మల్లారెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని మానేరు వాగు నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, హైదారాబాద్ తదితర పట్టణాలకు తిరుగుతాయి. ఇసుక లారీలు పోటీ పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. మండలంలోని అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అక్కడ రోడ్డు గుంతలమయంగా మారింది. అయినప్పటికీ సోమవారం ఇరువైపులా ఆర్టీసీ బస్సు-లారీ డ్రైవర్లు ఒకదాని వెనుక ఒకటి అతి వేగంతో పోటీ పడడం కనిపించింది. దీంతో బస్సులోని ప్రయాణికులు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం మండలంలోని సదాశివపల్లి బస్టాండ్ వద్ద ముందు ఉన్న లారీని వెనకాల నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుమారు 15 మందికి గాయాలయ్యాయి. వేగంగా వెళ్లవద్దని విజ్ఞప్తి చేసినా సదరు ఆర్టీసీ డ్రైవర్ వినిపించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.



అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వంతెన దగ్గర ర్యాష్ డ్రైవింగ్‌తో వెలుతున్న బస్సు-లారీలు

పుస్తెల తాడు లాక్కెళ్లిన దొంగ అరెస్టు

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన దొంగను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దొంగను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని మోహర్‌నగర్‌కు చెందిన గాదెరాణి అనే వృద్ధురాలు ఇంటిలో ఒక్కతే తలుపు దగ్గర పెట్టుకుని పడుకుని ఉండగా శాంతినగర్‌కుచెందిన మెరుగు భాస్కర్ అనేవ్యక్తి 15వతేదీన మధ్యాన్న సమయంలో తలుపులు తీసుకుని లోపలికి వచ్చి రాణి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడుతోపాటు రెండు గుండ్లు పట్టుకుని పారిపోయాడు. రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా భాస్కర్ అనే దొంగను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. దొంగించిన సొమ్మును అమ్ముకోగా వచ్చిన డబ్బులు జల్సాలకు వాడుకోగా మిగిలిన డబ్బులను సీజ్ చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



దొంగను అరెస్ట్ చూపిస్తున్న టౌన్ సీఐ కృష్ణ

యువకుడిపై పోక్సో కేసు

జమ్మికుంట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయ మాటలు చెప్పి వివాహం చేసుకున్న ఓ యువకుడు ఆమెను గర్భిణిని చేసి ఇంటినుంచి బయటకు గెంటేయగా పోలీసులు అతడిపై పోక్సోకేసు నమోదు చేశారు. జయశంకర్ భూపాలపల్లిజిల్లా మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటిపల్లిలో చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జమ్మికుంట మండలం పాపక్కపల్లికి చెందిన బాలిక తండ్రి ఏడేళ్లక్రితం మృతిచెందాడు. అప్పటినుంచి తల్లితోపాటు అమ్మమ్మగారి ఊరైన పెద్ద కోమటిపల్లిలో ఉంటోంది. అదేగ్రామానికి చెందిన వంశీ సదరు బాలికకు మాయమాటలు చెప్పి ఈ ఏడాది మేలో పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్న, కానుకల కింద ఎకరం భూమి, నాలుగుతులాల బంగారం ఇచ్చారు. కొద్దినెలలు కలిసిఉన్న తర్వాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. భర్తతోపాటు అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధింపులకు దిగారు. పలుమార్లు పెద్దలసమక్షంలో పంచాయితీలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. తనను మోసగించి వివాహం చేసుకొని గర్భిణిని చేశాడని బాలిక గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన కార్యదర్శి వెంటనే పోలీస్‌లకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు పోక్సోచట్టం కింద యువకుడి పై కేసు నమోదు చేశారు. బాలికను సఖీ కేంద్రంలో చేర్పించారు.

రాత్రివేళ చెరువులో బావి తవ్వకం

● గ్రామస్థుల ఫిర్యాదుతో అడ్డుకున్న పోలీసులు

చందుర్తి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన వ్యక్తి రాత్రివేళలో చెరువులో అక్రమంగా వ్యవసాయ బావి తవ్విస్తుండగా గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు అడ్డుకున్నారు. చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని కొత్తచెరువులో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. కొత్త చెరువులో బావిని తవ్వించేందుకు మూడు రోజుల క్రితం జేసీబీ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో పనులు నిలి పివేశారు. సోమవారం రాత్రి బావి తవ్వేందుకు పనులు ప్రారంభించగా పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని పనులను నిలిపి వేశారు. చెరువులోనీరు ఉండటంతో ప్రస్తుతం తిమ్మాపూర్ ఆశిరెడ్డిపల్లి రామన్నపేట, అనంతపల్లి గ్రామాల్లో వ్యవసాయబావుల్లో, బోర్లలో నీటికొరత లేకుండా ఉంది. చెరువులో బావితవ్వడంతో భూగర్భజలాలు ఇంకిపోయి బోర్లు అడుగంటే ప్రమాదంపొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చందుర్తి తహసీల్దార్ భూపతిని వివరణ కోరగా చెరువులో బావి తవ్వడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, చెరువుల్లో బావులు తవ్వరాదన్నారు. మంగళవారం బావిని తవ్వే ప్రాంతానికి సర్వేయర్‌ను పంపిస్తామని తెలిపారు.

పత్తి ఏరేందుకు వలస కూలీలు

● రైతుకు లాభదాయకం

● కర్నూలు కూలీలకు డిమాండ్



నర్సక్కపేట గ్రామంలో పత్తి ఏరుతున్న ఆంధ్ర కూలీలు

ఇల్లంతకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి ఏరేందుకు ఇల్లంతకుంట మండలానికి ప్రతి యేటా ఏపీలోని కర్నూలు నుంచి కూలీలు వస్తుంటారు. మండలంలోని నర్సక్కపేట, జవారిపేట, గాలిపెల్లి, కేసన్నపల్లె, పత్తికుంటపల్లె, ఆరెపల్లి తదితర గ్రామాలలోని రైతులు ఎక్కువగా పత్తి సాగుచేస్తుంటారు. విత్తనాలు నాటిన నుంచి వర్షాలు వెంటాడటంతో పత్తి రైతులు కష్టాలు పెరిగిపోయాయి. పంటచేతికి అందివచ్చే దశలో మరోసారి కురిసిన వర్షాలతో పత్తి సాగు కష్టంగా మారింది. స్థానిక కూలీలు లభ్యం కాకపోవడం, కూలి, ఆటోకిరాయిలు కలుపుకొని ఒక్కొక్కరికి రూ. 450 వరకు ఖర్చు అవుతోంది. అయినా రోజుకు కేవలం 20కిలోలు మాత్రమే పత్తి ఏరుతున్నారని రైతులు వలస కూలీలను పత్తి ఏరేందుకు తీసుకువస్తున్నారు. ఈ యేడు ఏపీలోని కర్నూలు నుంచి 150మంది వలస కూలీలు నర్సక్కపేట గ్రామానికి చేరుకున్నారు. వారు నివాసం ఉండటానికి రైతుల కొట్టాలు ఇచ్చి విద్యుత్ సౌకర్యం కల్పించారు. వలస కూలీలు ఉదయం ఆరు గంటలకే చేనులోకి వెళ్లి సాయంత్రం ఆరు గంటల వరకు పత్తి ఏరుతారు. రైతులు కిలోకు రూ.15చెల్లించడమే కాకుండా ఆదివారం ఒక్కోకూలీకి పావుకిలో చికెన్ ఇస్తారు. వలస వచ్చిన కూలీలు ఎనమిది మంది కలిసి ఒక బ్యాచ్‌గా ఏర్పడి నివాసం ఉంటున్నారు. కర్నూలులో సరైన ఉపాధిలేకపోవడంతో వలస వచ్చామని వారు పేర్కొంటున్నారు. ప్రతిరోజు ఒక్కరు 50కిలోల వరకు పత్తి ఏరుతుంటారు. వర్షాల వల్ల పత్తి ఏరడం ఇబ్బందిగా మారిందని కూలీలు పేర్కొంటున్నరు. పత్తి ఏరడం పూర్తి అయిన తర్వాత సంక్రాంతికి ఇంటికి వెలుతామని పేర్కొంటున్నారు. వీరితో పాటు ఇప్పటికే పలు గ్రామాలలో ఉన్న బీహార్ కూలీలు కూడా పత్తి ఏరుతున్నారు.

పనిదొరక ఇక్కడికి వచ్చాం

– జగతపుగారి మాణిక్యమ్మ, కోటికల్, కర్నూలు



పుట్టిన ఊరును వదిలిపెట్టి రావడం బాధగా ఉన్నా అక్కడ పనిలేకపోవడంతో పత్తి ఏరడానికి వచ్చాం. రెండు నెలల పాటు పత్తి, మిరప ఏరిన తర్వాత సంక్రాంతికి ఇంటికి వెలుతాం. ఉదయం చేనులోకి వచ్చామంటే సాయంత్రం ఇంటికి వెలుతాం. కిలోకు రూ. 15చొప్పున రైతులు ఇస్తున్నారు. ప్రతి రోజు 50కిలోల పత్తి ఏరుతాం. కొట్టాలలో సరైన వసతులు లేకపోయినా సర్దుకుపోతున్నాం. కర్నూలు నుంచి వచ్చిన 150మందిమి నర్సక్కపేట గ్రామంలోనే ఉంటున్నాం.

కూలీ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటాం

– ఏలియరాజా, పెద్దకడూరు, కర్నూలు



కూలీపని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటాం. రెండు నెలలపాటు పత్తిఏరిన తర్వాత సంక్రాంతి పండుగకు ఇంటికి పోతాం. తర్వాత గుంటూరుకు మిర్చి ఏరడానికి పోతాం. పత్తి ఏరడమే కాకుండా ఇంటికి చేర్చే బాధ్యత కూడా మాదే. వర్షాలు పడటం వల్ల పత్తి ఏరడం కష్టంగా మారి సరైన కూలి పడటం లేదు. ప్రయాణ చార్జీలు రైతులే భరిస్తారు.

స్థానిక కూలీలు లభించకపోవడం వల్లనే

– కొత్త శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నర్సక్కపేట



స్థానిక కూలీలు లభించకపోవడం వల్ల వలస కూలీలతో పత్తి ఏరిస్తున్నాం. స్థానిక కూలీలకు రూ. 350తోపాటు ఆటో కిరాయి ఇవ్వాల్సి ఉంటుంది. తక్కువ పత్తి ఏరడం వల్ల రైతులకు నష్టం జరుగుతుంది. వలస కూలీలు పత్తిని ఇంటివద్దకు చేరుస్తారు. వర్షాల వల్ల వలస కూలీల ధర కూడా పెరిగింది. ఈసారి పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సీసీఐ నిబంధనలలో కొంత సడలింపు ఇవ్వాలి.

కుటుంబ కలహాలతో భర్తను హతమార్చిన భార్య

● తల్లి సహాయంతో

గొంతుకు చున్నీ బిగించి హత్య

మల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో తల్లి సహాయంతో భర్తను హతమార్చిన ఘటన మల్లాపూర్ మండలం కొత్తదాంరాజుపల్లిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మందపల్లి భూమేష్(31) అనే వ్యక్తిని అతడి భార్య విజయ తన తల్లి లక్ష్మితో కలిసి గొంతుకు చున్నీ బిగించి హత్య చేసింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి అర్బన్ కాలనీకి చెందిన భూమేష్‌కు మల్లాపూర్ మండలం కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన విజయతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. భూమేష్‌కు ఇది మొదటి వివాహం కాగా, భార్య విజయ్‌కు రెండో వివాహం. భూమేష్ మెట్‌పల్లిలో ఓ షాపులో పని చేస్తున్నాడు. కొంత కాలంగా భూమేష్ తాగుడుకు బానిసై ఇంట్లో ఖర్చులకు డబ్బులు ఇవ్వకపోవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో విజయ కొన్ని నెలల క్రితం తల్లి గారి ఊరైన కొత్తదాంరాజుపల్లి గ్రామానికి వచ్చి గది కిరాయి తీసుకొని ఉంటోంది. తరువాత కొంత కాలానికి భార్య విజయ వద్దకు భూహేష్ వచ్చి కొత్తదాంరాజుపల్లిలోనే కలిసి ఉంటున్నారు. ఆదివారం మత్యం మత్తులో భూమేష్ తన భార్య విజయను కొడుతుండగా ఆమె తల్లి లక్ష్మి అడ్డుకుంది. దీంతో భూహేష్ అత్త లక్ష్మిపై దాడికి యత్నించాడు. దీంతో విసుగు చెందిన విజయ, ఆమె తల్లి లక్ష్మిలు కలిసి భూమేష్ గొంతుకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. భూమేష్ ఇంటి బయట వాకిట్లో పడి చనిపోయాడని చెప్పి బయట పడుకోబెట్టారు. భూమేష్ మృతదేహాన్ని చూసిన బంధువులు ఘటనపై అనుమానం వ్యక్తం చేశారు. ఆర్ఐ రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భక్తులు

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ సోమవారం పెరిగింది. దీంతో స్థానికలక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వస్వామి, శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోటిలింగాలలో కాశీ శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా రుద్రాభిషేకం..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి, దర్శనం చేసుకున్నారు.

కోటిలింగాలలో కార్తీక సందడి..

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాలలో సోమవారం కార్తీక సందడి నెలకొన్నది. భక్తులు అధిక సంఖ్యలో గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలారు. అనంతరం శ్రీపార్వతీ కోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు. భక్తులు దీపదానాలు చేయగా ఆలయఅర్చకులు నాగరాజుశర్మ స్వీకరించారు.

ఆలయచైర్మన్ పూదరి రమేష్, ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు



అండర్-17 బాలుర విభాగంలో రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న 69వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో తెలంగాణలోని ఉమ్మడి 10జిల్లాల నుంచి దాదాపు 240మంది క్రీడాకారులు పోటీపడ్డారు. గెలుపొందిన క్రీడాకారులకు వీర్ల హనుమంతరావు బహుమతులు ప్రదానం చేశారు. అండర్-17బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా మొదటి, మెదక్‌జిల్లా రెండో, కరీంనగర్‌జిల్లా జట్టు మూడోస్థానం, బాలుర విభాగంలో ఆదిలాబాద్‌జిల్లా మొదటిస్థానం, కరీంనగర్‌జిల్లా రెండోస్థానం, వరంగల్‌జిల్లా మూడోస్థానం సాధించాయి. అండర్-14బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా మొదటిస్థానం, కరీంనగర్ జిల్లా రెండోస్థానం, మెదక్ జిల్లా మూడవస్థానం, బాలుర విభాగంలో మెదక్‌జిల్లా మొదటిస్థానం, ఆదిలాబాద్‌జిల్లా రెండోస్థానం, కరీంనగర్‌జిల్లా జట్టు మూడోస్థానం సాధించాయి. అన్నివిభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రాజరాజేశ్వరి, పీడీ దత్తాద్రి, గ్రామకార్యదర్శి శ్యామ్, ఎస్‌జీఎఫ్‌సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వీర్‌పాల్‌రెడ్డి, శ్రీను, సత్యనారాయణ, రూపరాణి, రాజగోపాల్, రమేష్, హరికిషన్, రమణ, రాజ్‌కుమార్, పత్తి రాజిరెడ్డి, కృష్ణవేణి, స్వప్న, వనిత, అహ్మద్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రశంసాపత్రంతో విద్యార్థి అమర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం మధుమాలతీ, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పెద్దూరు అమర్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం మధుమాలతి సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈ నెల 16న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్(హైజంప్) అండర్- 14 విభాగంలో విద్యార్థి అమర్ అత్యంత ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. వచ్చే నెల 4 నుంచి 7 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి అమర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీడీ అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సోమవారం నీటి మట్టం నిలకడగాఉంది.ఎగువప్రాంతం నుంచి 9,355 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తినీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం80.501టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టునుంచి 9,355 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్లద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతోంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మెట్‌పల్లి గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన జక్కుల అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధర్మపురి, కోటిలింగాలలో వైభవంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి 27వరోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలి పుణ్య ప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి పూజలు

కోటిలింగాలలో..

వెల్గటూర్: కార్తీకమాసం పురస్కరించుకొని కోటిలింగాల వద్ద గోదావరి హారతి కార్యక్రమం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, నాయకులు, భక్తులు, మహిళలు గోదావరినది వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మల మంత్రోచ్ఛరణల మధ్యగోదావరి మాతకు హారతి ఇచ్చారు. అంతకు ముందు శ్రీపార్వతీ కోటేశ్వరస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గోదావరి మాతకు పూజలు చేసి కార్తీకదీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, గుమ్మల వెంకటేష్, మెరుగు శ్రీనివాస్, గంద్ర శ్రీకాంత్ రావు, మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కోటిలింగాలలో గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

వేములవాడకు పోటెత్తిన భక్తులు

● స్వామివారిని దర్శించుకున్న 50వేలకు పైగా భక్తులు ● కోడె మొక్కుకు 3గంటల సమయం



భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీభీమేశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు50 వేలకుపైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. స్వామివారికి కోడెల మొక్కులు చెల్లించేందుకు కనీసం మూడు గంటల సమయం పట్టింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇబ్బందుల పాలయ్యారు. భీమేశ్వరాలయానికి ఏ వైపు నుంచి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేకపూజలు చేశారు. నిత్య అన్నదానసత్రంపై అంతస్థులో కళ్యాణం, సత్యనారాయణ స్వామివ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు స్వామి వారికి మహాలింగార్చన, కుంకుమ పూజలు, పెద్దపల్లకి సేవలు, ఆకు పూజలు చేసి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో రమాదేవి, డిఈఈ రఘునందన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టౌన్‌సీఐ వీర ప్రసాద్, ఎస్‌ఐ ఎల్లాగౌడ్, ట్రాఫిక్ ఎస్‌ఐ రాజులు 50మంది పోలీసులచే బందోబస్తు నిర్వహించారు. కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, పరివారదేవతలకు అర్చనలు నిర్వహించారు. రాత్రి మహాలింగార్చన నిర్వహించారు.

ఎల్‌ఈడీ స్క్రీన్‌పై రాజన్న దర్శనం

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విస్తరణపనులు జరుగుతున్న సందర్భంగా తాత్కాలికంగా స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో సోమవారం తూర్పు వైపున ప్రచారరథంవద్ద ఏర్పరిచిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై భక్తులు రాజన్నను దర్శించుకున్నారు.

బద్దిపోచమ్మకు బోనాలు..

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. భక్తులతో బద్దిపోచమ్మ ఆలయం కిక్కిరిసిపోయింది. అమ్మవారి దర్శనానికి రెండుగంటలు పట్టింది. భక్తులు పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు.

● భక్తుల ఇబ్బందులు ..

స్వామివారి ఆర్జితసేవల టికెట్లకోసం పెద్ద ఎత్తున భక్తులు ముఖ్యబుకింగ్ కౌంటర్ వద్దకు చేరుకున్నారు. కల్యాణ ప్రాంగణం సామర్థ్యం దృష్ట్యా కేవలం 79 టికెట్లను మాత్రమే జారీచేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అసహనానికి గురైన భక్తులు ముఖ్యబుకింగ్ కౌంటర్ అద్దాలు ధ్వంసం చేశారు. కార్తీకసోమవారం కావడంతో వందలాది వాహనాలతో భక్తులు వేములవాడకు చేరుకున్నారు. గుడిచెరువు పార్కింగ్‌స్థలం వాహనాలతో నిండిపోయింది. భీమేశ్వరాలయంలో ముఖ్యబుకింగ్ కౌంటర్ వద్ద భక్తుల ఆందోళనతో ఆలయ ఈవో ఎల్. రమాదేవి తనిఖీలు నిర్వహించారు.



వేములవాడ పార్కింగ్‌లో వందలాది వాహనాలు

యాంటి బయోటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు

జమ్మికుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాంటి బయోటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు వాటిల్లుతుందని విస్తరణ సంచాలకుడు డాక్టర్ కిషన్‌కుమార్ అన్నారు. సోమవారం పీవీనరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రాలు, సత్గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో పలు అంశాలపై కేవీకేలో రెండురోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటిబయోటిక్స్‌తో పశువులతో పాటు ప్రజలప్రాణాలకు ముప్పుతప్పదన్నారు. డాక్టర్‌వంశీకృష్ణ అధిక మోతాదులో వాడితే కలిగేనష్టాల గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ అంబిక పాకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ ఎమ్ కిషన్ కుమార్, డాక్టర్ బిందుమాధురి, డాక్టర్ సాయికిరణ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కిషన్ కుమార్

అభివృద్ధి పనులు పరిశీలించిన విప్



హైడ్రాలిక్ రిగ్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వర సదన్ ఆవరణలో జరుగుతున్న శ్రీసామవేదం షణ్ముఖ శర్మగారి ప్రవచన కార్యక్రమానికి విప్ హాజరయ్యారు. అనంతరం పైల్ ఫౌండేషన్ వేయడానికి అవసరమైన హైడ్రాలిక్ రిగ్ (పైలింగ్ రిగ్) చెన్నై నుంచి వేములవాడకు చేరుకున్న విషయం తెలుసుకుని పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి,ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఏఈఈ బ్రహ్మనగర్ శ్రీనివాస్, అశోక్ ఉన్నారు.

సమస్యలపై మహిళలు ఫిర్యాదు చేయాలి

ఇల్లంతకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు వివక్షతకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని ఏఎస్ఐ ప్రమీల పేర్కొన్నారు. మండలంలోని రేపాక, సోమారంపేట, అనంతగిరి తదితర గ్రామాలలోని పాఠశాలల్లో సోమవారం షీటీం సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినిలు ఆత్మరక్షణ కోసం కరాటేలాంటివి నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై వీరయ్య, పీసీలు శ్రీనివాస్, ప్రియంకలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెబాట

ఇల్లంతకుంట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించకపోతే వచ్చేనెల 10 నుంచి సమ్మె చేస్తామని జిల్లాప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జుబేదా ఉస్సినాబేగం, సంతోష, రజిత, లక్ష్మి, నర్సవ్వ, కొమురవ్వ, గిరిజ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కేటీఆర్

ముస్తాబాద్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు నూతన వధూవరులను సిరిసిల్ల ఎమ్మెల్యే కే. తారకరామారావ్ సోమవారం ఆశీర్వదించారు. ఇటీవల పోత్గల్ ఫాక్స్ వైస్ చైర్మన్ మీరు రాజేశం కుమారుడి వివాహం జరిగింది. అలాగే బీఆర్ఎస్‌వి యువజన విభాగం అధ్యక్షుడు ఎండి నవాజ్ వివాహం, అలాగే బీసీ విభాగం మండల అధ్యక్షురాలు దబ్బెడ రేణుక కుతురు వివాహం, అలాగే కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు దేవయ్య కుమారుడు, రామలక్షణపల్లె మాజీ సర్పంచ్ తమ రవీందర్‌రెడ్డి కూతురు వివాహం ఇటీవల జరుగగా వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమల్లో మండల అధ్యక్షుడు సురేందర్ రావు, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ ఆర్బీఎస్ అధ్యక్షుడు గోపాల్ రావ్ నాయకులు తదితరలు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ కార్యవర్గం ఎన్నిక

ముస్తాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల బీసీ జేఏసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలో మండలంలోని 22 గ్రామాలకు చెందిన అన్ని సామాజిక వర్గాల సభ్యులు హాజరయ్యారు. 42 శాతం రిజర్వేషన్లపై చర్చించిన అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా కొండ యాదగిరి గౌడ్, కో కన్వీనర్‌గా తోట ధర్మేందర్, ప్రధాన కార్యదర్శిగా చిగురు వెంకన్న, జింక పవన్, తాడేపు కొమురయ్య, ఉపాధ్యక్షులుగా శీల ప్రశాంత్, జిల్లెళ్ల మల్లేశం, బాద సరేశ్, బోయిని గంగాధర్, కదిరే సత్తయ్య, కార్యదర్శులుగా చిట్నేని సరిత, గాడిచర్ల రామచంద్రం, గీస భిక్షపతి, తుపాకుల శ్రీనివాస్, కోడే శ్రీనివాస్, రాగం కుమార్, మేతే బాలరాజ్, పెంజర్ల బాలేశ్ల, పూస బాలయ్య, కోశాధికారిగా సుద్దాల దేవయ్యలను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. వంట గదిలోని సరుకులు, పరిసరాలను పరిశీలించారు. తాజా కూరగాయాలతో వంటకాలను తయారు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, విద్యను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం మధు మాలతీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సీసీఎస్ పోలీసుల తనిఖీలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సూపర్ మార్కెట్‌లో సీసీఎస్ పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. గుట్కా, పొగాకు, బెల్లం, తదితర సరుకుల కోసం తనిఖీలు ముమ్మరం చేశారు. దుకాణాల్లో నిశితంగా పరిశీలించారు. నిషేధిత వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృద్ధుల కోసం ప్రత్యేక చట్టం

● చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పర్శరాములు

తంగళ్లపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, వృద్ధుల నిర్వహణ సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం ఉందని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పర్శరాములు అన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టంపై అవగహన సదస్సు నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లడుతూ వృద్ధులు ఏమైనా ఇబ్బందులు పడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం అంజనేయులు, వృద్ధాశ్రమం కో ఆర్డినేటర్ మమత తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన అధికారులు

వేములవాడ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు జల బ్యాక్ వాటర్‌లో పంట పొలాలు నీట మునగడంతో అధికారులు సోమవారం పరిశీలించారు. మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో మిగులు భూముల్లో పంట పొలాలు నీట మునిగి నష్టపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన రైతులతో అడిషనల్ కలెక్టర్ నరేష్ , ఈఈ జగన్, డీఈ జగన్ మాట్లాడారు. పొలాలను పరిశీలించి వాటర్ కిందికి వదిలే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్రం మహేష్, గుండెకార్ల నరేష్‌లక్ష్మణ్ లింగయ్య ఉన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ టీం

వేములవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ టీం సభ్యులు సోమవారం సందర్శించారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరికరాలు, పరిశుభ్రతను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారా తదితర వివరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యతో కలిసి ఆసుపత్రి ఆవరణను పరిశీలించి రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. టీం సభ్యులు రాధిక, శ్రీకాంత్ స్థానిక వైద్యులు సుభాషిణి, తిరుపతి, రవీందర్, ప్రణతి తదితరులు ఉన్నారు.

అద్దె చెల్లించలేదని మున్సిపల్ దుకాణాలకు తాళం

సిరిసిల్ల టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాల అద్దె చెల్లించని వారిపై అధికారులు కొరఢా ఝులిపిస్తున్నారు. అద్దె చెల్లించని దుకాణాలను రెండు రోజుల నుంచి సిరిసిల్ల మున్సిపల్ అధికారులు తాళాలు వేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని పాత బస్టాండ్, గాంధీనగర్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాల యజమానులు కొందరు దాదాపు ఏడు నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో మున్సిపల్ అధికారులు దుకాణాలకు తాళాలు వేస్తున్నారు. ప్రతినెలా అద్దె చెల్లించాలని హెచ్చరించినా దుకాణాల యజమానులు నిర్లక్ష్యం చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తాళాలు వేశామని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

ప్రజావాణిలో సమస్యల వెల్లువ

● ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి ● జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన దేశాయిపేట రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అలాగే ప్రజావాణికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో పాటు అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అధికారులను కలిసి తమ ఫిర్యాదులను అందించారు. ఈ ప్రజావాణిలో 149 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో రెవెన్యూకు 43, హౌజింగ్ శాఖకు 35, డీఆర్‌డీవోకు 12, ఎస్‌డీసీకి 11, విద్యాశాఖకు 7. జిల్లా సంక్షేమ శాఖకు 7, సిరిసిల్ల మున్సిపాల్టీకి 4, జిల్లా వైద్యాధికారికి 4, ఉపాధి కల్పన శాఖ అధికారికి 4, జిల్లా పంచాయితీ అధికారికి 4, నీటి పారుదల శాఖకు 4, జిల్లా వ్యవసాయాధికారికి 3, లీడ్‌బ్యాంక్ మేనేజర్‌కు 2, సెస్ కార్యాలయానికి 2, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి 1, మైనింగ్ శాఖకు 1, మైనార్టీ సంక్షేమ శాఖకు 1, పీఆర్ ఈఈ కి 1, సిరిసిల్ల ఆర్టీసీకి 1, కోనరావుపేట ఎంపీడీవోకు 1, జిల్లా ఎస్పీ కార్యాలయానికి 1 చొప్పున వచ్చాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులను ఎన్ని పరిష్కారించారనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టవద్దని అదేశించారు. అన్నిశాఖల అధికారులు బాధ్యులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీఆర్‌డీవో శేషాద్రి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఆర్డీవో రాధాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయండి

గంభీరావుపేట మండలం దేశాయిపేట గ్రామంలో నివాసం ఉంటున్న తాము కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామశివారులో ఉన్న వంద ఎకరాల్లో పంటలను సాగుచేసుకుంటూ జీవుతున్నాం. గత పదిసంవత్సరాలుగా తాము పండించిన ధాన్యం ను మాచారెడ్డి మండలంలో లచ్చపేటలో ఐకేపీలో విక్రయిస్తున్నాం. అయితే ఈ సారి మాత్రం తాము పండించిన ధాన్యంను మీ జిల్లాలో విక్రయించుకోవాలని తాము కొనుగోలు చేయమని చెప్పడంతో ధాన్యం తీసుకుని గంభీరావుపేట మండల కేంద్రానికి పోయేందుకు ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టర్ స్పందించి గతంలో మాదిరిగా తమ ధాన్యంను కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని గ్రామ రైతులు కోరారు.

డబుల్‌బెడ్‌రూంలకు డబ్బులు ఇప్పించాలి

వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో అప్పులు చేసి డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నామని వాటికి రావాల్సిన డబ్బులను ఇప్పించి ఆదుకోవాలంటూ లబ్ధిదారులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవించి వినతిపత్రాన్ని అందించారు. గత ప్రభుత్వంలో ఉత్తం అంజయ్య అనే కాంట్రాక్టర్ 12 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి బిల్లు రావడం లేదని మధ్యలో నిలిపివేశాడన్నారు. అప్పులు చేసి ఇళ్లను పూర్తిచేసుకున్నామని ఇప్పడు అప్పులు చెల్లించే స్థాయిలో లేమని కలెక్టర్‌కు విన్నవించారు.

మమ్మలను ఆదుకోవాలి

- అనవేణి లతిక, ధర్మారం, కోనరావుపేట

కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన తన భర్త అనవేణి తిరుపతి వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో వాటి తీర్చేమార్గం లేక పురుగుల మందు తాగి అత్మహత్యకు చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలతో ఒంటరిగా జీవిస్తున్నా. నా పిల్లలను చదివించేందకు స్థోమత లేకపోవడంతో పూట గడువడానికి ఇబ్బందులు పడుతున్నాం. కలెక్టర్ స్పందించి వితంతు పింఛన్‌తో పాటు ఉపాధి కల్పించాలి.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- బైరినేని రాము,చిన్నలింగాపూర్,

తంగళ్లపల్లి మండలంలో పలు గ్రామాలకు నీటిని అందిస్తున్న కెనాల్ నిర్మాణాన్ని రైతులు నష్టపరిహారం కోసం అడ్డుకోవడంతో మా గ్రామాలకు నీళ్ల రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరం 11వ ప్యాకేజీ కాలువ ద్వారా ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామం నుంచి తంగళ్లపల్లి మండలంలోని చిన్నలింగాపూర్, నర్సింహులపల్లె, బాలమల్లుపల్లె, బస్వాపూర్ గ్రామాల్లో చెరువులకు కాలువలను నిర్మించారు. అయితే దాచారంలో రైతుల భూములకు నష్టపరిహారం రాకపోవడంతో పనులను అడ్డుకుంటున్నారని ఆ రైతులకు నష్టపరిహారం అందించి పనులు పూర్తి చేయాలి.

పగిలిపోయిన మిషన్ భగీరథ పైపులైను.. వృథాగా నీరు



వృథాగా పోతున్న నీరు

వేములవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పైపు పగిలిపోయి నీరు వృధాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానిక కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని మల్లారం నంది చౌరస్తాకు అతి సమీపంలోని మిషన్ భగీరథ పైపు పగిలిపోయి గత పక్షం రోజులుగా నీరు వృధాగా పోతోంది. మల్లారం వెళ్లే బీటీ రోడ్డుపై నీరు పారవడంతో వాహనదారులకు, స్థానిక కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు సమాచారం అందించినప్పటికీ పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తాత్కలిక మరమ్మత్తులతో ఇబ్బందులు

మల్లారం నంది విగ్రహం చౌరస్తాకు సమీపంలో భీమేశ్వర గార్డెన్‌కు వెళ్లే రోడ్డులో మిషన్ భగీరథ పైపు లైన్ తరుచూ పగిలిపోతోంది. సంవత్సరంలో మూడు సార్లు పైపు పగిలి నీరు వృధాగా పోతున్న తాత్కలికమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మల్లారం వైపు వెళ్లే బీటీ రోడ్డును అనుకుని డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్డుపై పారుతోంది. లీకైన నీటిలో ఈ నీరు కలువడంతో దుర్వాసన వస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు.

శాశ్వతంగా పరిష్కరించాలి

- నీరటి మల్లేశం, వేములవాడ



మల్లారం రోడ్డు నుంచి భీమేశ్వర గార్డెన్ మీదుగా కోనాయపల్లి రోడ్డుకు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతాయి, బీటీ రోడ్డును, సీసీ రోడ్డుకు మద్యలో పెద్ద గుంత పడి మిషన్ భగీరథ పైపు తరచూ పగులుతోంది. తాత్కాలికంగా అతికించి చేతులు దులపుకుంటున్నారు. అధికారులు దృష్టిసారించి శాశ్వత పరిష్కారంతో ఇబ్బందులు లేకుండా చూడాలి.

వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృషి చేస్తున్నారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో రూ. 13 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తున్నామని అన్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్డు లేని కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి నాయకులు కూరగాయల కొమురయ్య, తోట రాజు, వనపర్తి శంకర్, ఫిరోజ్, రాజు ఉన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న రాష్ట్ర బాలికల కన్వీనర్ పూజ

వేములవాడ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని భారత విద్యార్థి ఫెడరేషన్ బాలికల విభాగం రాష్ట్ర కన్వీనర్ పూజ అన్నారు . సోమవారం వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల విభాగం ఆధ్వర్యంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ శ్రీ రాముల సంజన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిల పైన హత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. సంక్షేమ హాస్టల్ వసతి గృహల్లో ఉన్న విద్యార్థినిలకి సానిటరీ నాప్కిన్స్ అందించాలని ఆమె కోరారు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటూనే ఆడపిల్లలను పుట్టనిద్దాం, చదవనిద్దాం, కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో విద్యార్థినులకు అందజేస్తామన్న స్కూటీ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు సంక్షేమ హాస్టల్ వసతి గృహాల్లో విద్యార్థులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నిధులు కేటాయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి కాషాయకరణ చేయడం సరికాదన్నారు. అనంతరం 20 మందితో కన్వీనింగ్ కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యుడు కడారీ శివ,నాయకులు దీక్షిత, యామిని, సన, హీనా ఫ్రెడ్రోస్, నీరజ, లావణ్య, శివాని తదితరులు పాల్గొన్నారు.

శునకాల మధ్య విద్యార్థుల భోజనం



విద్యార్థుల మధ్య భోజనశాలలో శునకం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు17(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజనశాలలోకి శునకాలు చేరుతున్నాయి. కుక్కల మధ్య విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయాల్సి వస్తోంది. సోమవారం భోజనశాలలోకి శునకం రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. దీనిపై ఎంఈవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా పాఠశాల ఆవరణ, భోజనశాలలోకి కుక్కలు రాకుండా చర్యలు చేపడుతామని తెలిపారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

కోనరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య కోరారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు కెంద గంగాధర్, కచ్చకాయల మహేష్, కాశవేణి మహేష్, మహేందర్, కుంటెల్లి నాగరాజు, వంగల శ్రీనివాస్, సుమన్, ఉప్పుల అంజయ్య, శ్రీనివాస్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రశ్నించాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి



పాటలు పాడుతున్న కళాకారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మనువాద సిద్ధాంతాన్ని దేశంలో అమలు చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా నాయకులతో చాడ వెంకటరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాకు చలో ఖమ్మం బస్సు జాత చేరుకోగా సీపీఐ జిల్లా నాయకులు స్వాగతం పలికారు. ముందుగా ప్రజానాట్య మండలి కళాకారులు తమ ఆటపాటలతో ప్రజలను చైతన్య పరచారు. ఈ సందర్భంగా చాడ వెంటకరెడ్డి మాట్లాడారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో సీపీఐ ఆధ్వర్యంలో చలో ఖమ్మం శత జయంతి వేడుకలను డిసెంబర్ 26న నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలను చైతన్య పరచడం కోసం ఈ నెల 15న ఛలో ఖమ్మం బస్సుజాతా ప్రారంభమై ఈ రోజు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చేరుకుందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై సీపీఐ పోరాటాలు చేస్తుందన్నారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఏకమై గుణపాఠం చెప్పాలన్నారు. చలో ఖమ్మం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కలవేణి శంకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మణికంఠరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాస్, జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, నాయకులు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, శ్రావనపెల్లి మల్లేశం, మంద అనిల్, కుర్ర రాజేష్, ఆదిత్య, లక్ష్మన్ ఉన్నారు.

భూ సర్వేకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

ఎన్ని ఉన్నాయో తేలిపోతుంది. గతంలో సర్వేయర్లు టీపన ఆధారంగా సర్వే చేసేవారు. సర్వే నంబర్లను మొత్తం భూముల రైతులకు సంబంధించి భాగాల వారీగా సర్వే చేసి హద్దులు నిర్ణయించే వారు. ప్రస్తుతం డిజిటల్ సర్వే ద్వారా అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా సంబంధిత భూముల వివరా లు మ్యాపులను భూభారతి చట్టం వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. అనంతరం భూధార్ నెంబరు కేటాయిస్తారు.

జిల్లాకు 66 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు

రాజన్న సిరిసిల్ల జిల్లా లైసెన్స్‌డ్ సర్వేయర్లు 66 మందిని నియమించారు. వీరితో పాటు మరో 55 మంది లైసెన్సుల కోసం పరీక్షలు రాశారు. అందులో ఎంపికైన వారిలో కూడా కొంతమంది జిల్లాలో పని చేయనున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రిజిస్ట్రేషన్లు కూడా వేగవంతం అవుతాయి. ప్రస్తుతం రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం లాంటి వివ రాలతో మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. లైసెన్సులు సర్వేయర్లు అందు బాటులోకి వస్తే మ్యాప్‌లతో రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉంటుంది. లైసెన్స్‌డ్ సర్వేయర్లు సంబంధిత స్థలానికి సంబంధించిన మ్యాపులు తయారుచేసి పోర్టల్‌లో అప్లోడ్ చేస్తారు

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కోనరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి మేడి అంజయ్య అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా దళితుల ఐక్య సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ హక్కుల సాధన కోసం నవంబర్ 26న హలోమాల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు నీరటి శ్రీనివాస్, శివరాజ్, యాదగిరి, మాందాల శ్రీనివాస్, సుధాకర్, ఎరవెల్లి ప్రసాద్, చంద్రయ్య, ఏసు కుమార్, భూమయ్య, బాబు, పరశురాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు దుమాల, కోరుట్లపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురితో పాటు అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలు సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. భార్యాభర్తలు లత- రవికి రూ.5 వేలు, మహేందర్‌రెడ్డి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు నర్సింహారెడ్డి, దేవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, సతీష్, బాలు, మోహన్‌రెడ్డి, సుధాకర్ రావు, పద్మారెడ్డి, రామారావు, రాజం, వెంకట్ రెడ్డి, సందీప్, పర్శరాములు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం చెరుకు రసం బండిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో నాగంపేటకు చెందిన ప్రశాంత్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో 108 వాహనం సిబ్బంది సంఘటన వద్దకు చేరుకుని ప్రశాంత్‌ను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మినీ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

బోయినపల్లి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) బోయినపల్లి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి సోమవారం అధికారులు నాయకులు స్థల పరిశీలన నిర్వహించారు. పంచాయతీరాజ్ డీఈ విష్ణువర్ధన్‌తో పాటు తహసీల్దార్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, మాజీ ఎంపిటిసి అక్కనపల్లి ఉపేందర్ ఉన్నారు

భీమన్న సన్నిధిలో సబ్ కలెక్టర్ పూజలు

వేములవాడ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీ భీమేశ్వరాలయంలో మణిపూర్ సబ్ కలెక్టర్ విద్యామారి శ్రీధర్ సోమవారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను ఆలయ ఈవో రమాదేవి మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ విశేషాలను వివరించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.